క్లుప్తంగా

నెల్లిమర్ల ఎస్‌ఐకు ఎస్పీ ప్రశంస



ఎస్‌ఐ గణేష్‌ను అభినందిస్తున్న ఎస్పీ వకుల్ జిందల్

నెల్లిమర్ల: నెల్లిమర్ల ఎస్‌ఐ బి.గణేష్‌ను ఎస్పీ వకుల్ జిందల్ మంగళవారం ప్రత్యేకంగా అభినందించారు. విజయనగరంలోని ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో గణేష్‌కు దుశ్శాలువ కప్పి, పుష్పగుచ్ఛం, ప్రశంసా పత్రం అందజేశారు. పోలీసు విభాగం ప్రారంభించిన సంకల్పం కార్యక్రమాన్ని నెల్లిమర్ల టౌన్, గ్రామాల్లో విజయవంతంగా నిర్వహించినందుకు కొనియాడారు. మాదకద్రవ్యాల నియంత్రణలో మంచి పాత్ర పోషిస్తున్నారని ఎస్పీ అభినందించారు. భవిష్యత్తులో కూడా మరింత కృషి చేయాలని సూచించారు.

పేదలకు సాయం



పేదలకు బియ్యం పంపిణీ చేస్తున్న శ్రీధర్

విజయనగరం ఫోర్ట్: పేదలకు చేయూతనివ్వడంలో సంతృప్తి ఉందని వ్యాపార వేత్త చెరుకూరి శ్రీధర్ అన్నారు. స్థానిక కణపాక అగురవీధిలో మారుతీ స్వయం సహాయక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం 50 మంది పేదలకు బియ్యం, గోధుమ రవ్వ తదితర నిత్యావసర వస్తువులు పంపిణీ చేసారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దాతల సహకారంతో ప్రతి నెల పేదలకు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. వృద్ధాప్యంలో తల్లిదండ్రులను ప్రేమ, ఆప్యాయతతో చూడాలన్నారు. కార్యక్రమంలో చంద్రశేఖరరావు, అప్పలస్వామి, తులసీరామ్, వెంకటరావు, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

క్షయవ్యాధి నిర్మూలనపై అవగాహన



క్షయ వ్యాధిపై అవగాహన ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

పూసపాటిరేగ: క్షయ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని గోవిందపురం పీహెచ్‌సీ వైద్యులు కె.త్రినాథ్, ఎ.వెంకట సుధారెడ్డి అన్నారు. మండలంలోని గోవిందపురం పీహెచ్‌సీ పరిధిలో క్షయ వ్యాధిపై అవగాహన ర్యాలీ మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్షయ వ్యాధిపై అవగాహన, నివారణ, వ్యాధి లక్షణాలు, వ్యాధి నిర్ధారణ పరీక్షలపై అవగాహన కల్పించారు. టీబీ వంద రోజుల నిర్మూలన కార్యక్రమం ద్వారా గోవిందపురం గ్రామంలో ప్రజలకు టీబీ నిర్మూలనకు అవగాహన చేసారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ బాలాజీ శ్రీకాంత్, శ్రీనివాసరావు, భారతి, ఉషా తదితరులు పాల్గొన్నారు.

కళావతికి మహిళారత్న పురస్కారం



విశిష్టమహిళా రత్న పురస్కారాన్ని అందుకున్న కోరుపోలు కళావతి

విజయనగరం టౌన్: ప్రముఖ రచయిత్రి కోరుపోలు కళావతికి విశిష్ట మహిళా రత్న పురస్కారాన్ని ఆల్ ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమీ హైదరాబాద్ సుందరయ్య కళానిలయంలో అందజేసింది. ఈ మేరకు ఆమె మంగళవారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. ఈమెకు ప్రకృతి అందాలు ప్రగతి పరిశోధనలు, అమెరికా అందాల గంధాలు వంటి రచనలు మంచి పేరు తీసుకువచ్చాయి. 12 నవలలు రాశారు. ఆమె సాహిత్య రంగానికి చేసిన సేవలను గుర్తించిన ఆల్ ది బెస్ట్ అకాడమీ ఈ నెల 15న పురస్కారాన్ని అకాడమీ వ్యవస్థాపకులు డాక్టర్ ఈఎస్ఎస్.నారాయణ, అతిథుల చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా పలువురు సాహితీవేత్తలు, అభిమానులు హర్షం వ్యక్తం చేశారు.

రైతులు, మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలి

భోగాపురం: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా రానున్న మూడు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయంటూ వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిందని తహసీల్దార్ ఎం.సురేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు తమ పొలంలో వరి కోతలు చేపట్టరాదని, కోసిన రైతులు పనలను దిబ్బలుగా వేసి వాటిపై పరదాలు కప్పుకోవాలని సూచించారు. మత్స్యకారులు వేటకు వెళ్లకుండా అప్రమత్తంగా ఉండి తమ పడవలను సురక్షితంగా ప్రాంతాలకు చేర్చుకోవాలని తెలిపారు.

అంచనా బడ్జెట్ రూ.156.93 కోట్లు

- 2025 - 26 కార్పొరేషన్ అంచనా బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన కౌన్సిల్
- గతేడాదితో పోల్చుకుంటే రూ.1.81 కోట్ల మేర తగ్గిన కేటాయింపులు
- నగరంలో అభివృద్ధి పనులకు రూ.72.45 కోట్లతో ప్రతిపాదనలు
- ఏకగ్రీవంగా ఆమోదించిన కార్పొరేషన్ కౌన్సిల్ సభ్యులు
- నగర అభివృద్ధికి అందరి సమన్వయం అవసరం : మేయర్ విజయలక్ష్మి





బడ్జెట్ సమావేశానికి హాజరైన కార్పొరేటర్లు, బడ్జెట్ సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ విజయలక్ష్మి

విజయనగరం: నూతన ఆర్థిక సంవత్సరంలో విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్‌కు సంబంధించిన బడ్జెట్‌లో కేటాయింపులు తగ్గుముఖం పట్టాయి. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మంగళవారం నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి అధ్యక్షతన జరిగిన సమావేశంలో రూ.156,93,74,848 కోట్లతో బడ్జెట్‌ను ప్రవేశపెట్టగా కౌన్సిల్ సభ్యులంతా ఆమోదించారు. మున్సిపాలిటీ హోదా నుంచి కార్పొరేషన్‌గా రూపాంతరం చెందిన నాలుగేళ్ల గడుస్తున్న తరుణంలో ప్రతి ఏడాది బడ్జెట్ రూపకల్పనలో పెరుగుదల నమోదు కాగా.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత తగ్గుముఖం పట్టడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. గతేడాదితో పోల్చుకుంటే ఈ ఏడాది అంచనా బడ్జెట్ మొత్తంలో రూ.1.81 కోట్లు తగ్గటం గమనార్హం. బడ్జెట్ రూపకల్పనలో భాగంగా 2024-25 సంవత్సరానికి సంబంధించి సవరణ బడ్జెట్ సాధారణ, మూల ధన ఖాతాల ముగింపు నిల్వ మొత్తం రూ.58,51,94,048 కోట్లను 2025-26 సంవత్సర బడ్జెట్ ప్రారంభ నిల్వగా చూపించారు. అన్ని ఖాతా పద్దుల కింద సాధారణ, మూల ధనముల రాబడి రూ.118,43,67,688 కోట్లకుగాను మొత్తం ఖర్చు రూ.156,93,74,848 కోట్లగాను లెక్కకట్టారు. ఆర్థిక సంవత్సరం ముగింపు నిల్వను రూ.20,01,86,888 కోట్లుగా అంచనా వేశారు. బడ్జెట్‌లో భాగంగా షెడ్యూల్డ్ కులాల ప్రాంత అభివృద్ధికి రూ.1.40 కోట్లు, షెడ్యూల్డ్ తెగల ప్రాంతాల అభివృద్ధికి రూ.70.41 లక్షలు, మాతా శిశు సంక్షేమం కోసం రూ.46.94 లక్షలు, దివ్యాంగుల సంక్షేమం కోసం రూ.28.16 లక్షలు, మురికివాడల అభివృద్ధికి రూ.3.75 కోట్లు కేటాయించారు. ఈ నిధులను కార్పొరేషన్ సాధారణ నిధుల నుంచి కేటాయించాల్సి ఉంటుంది. సమావేశం అనంతరం నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి మాట్లాడుతూ అందరి సహకారంతో నగర అభివృద్ధిని సాధించడమే కౌన్సిల్ ముఖ్య ఉద్దేశమని చెప్పారు. నగర ప్రజలకు అన్ని రకాల సదుపాయాలను కల్పించేందుకే రూ.156.93 కోట్లతో బడ్జెట్ రూపకల్పన చేయడం జరిగిందన్నారు. కౌన్సిల్ సభ్యులందరూ బడ్జెట్‌ను ఆమోదించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. బడ్జెట్ రూపకల్పనలో భాగస్వాములైన సిబ్బందిని అభినందించారు. ప్రజల నుంచి స్వచ్ఛంద విరాళాలకై కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ నిధులు (సీఎస్ఆర్) ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు.

కార్పొరేషన్ కమిషనర్ పి.నల్లనయ్య మాట్లాడుతూ నగర అభివృద్ధి కోసం అవసరమైన నిధుల సమీకరణలో పన్నుల రాబడిపై ప్రత్యేక దృష్టి సారించటం జరిగిందన్నారు. ఖజానాకు వివిధ మార్గాల ద్వారా రావాల్సిన ఆదాయంపై బడ్జెట్‌లో పొందుపరిచినట్లు చెప్పారు. నూతన అసెస్‌మెంట్‌లు, ఖాళీ స్థలాలకు సంబంధించిన పన్నులు, ట్రేడ్ లైసెన్స్‌లు ద్వారా అదనపు ఆదాయం, నూతన కుళాయి కలెక్షన్‌ల ద్వారా ఆదాయం సమకూర్చుకోవటంతో పాటు రైల్వే ఆస్తుల నుంచి పన్నుల రూపంలో ఆదాయం సమకూరేలా బడ్జెట్ రూపకల్పన చేసినట్లు తెలిపారు.

సమావేశంలో వివిధ డివిజన్‌ల కార్పొరేటర్లు అల్లు చాణక్య, కేదారశెట్టి సీతారామమూర్తి, రేగాన రూపా దేవి, బాలి పద్మావతి, బండారు ఆనంద రావు, మారోజు శ్రీనివాసరావు, వింత ప్రభాకర్ రెడ్డి మాట్లాడగా... డిప్యూటీ మేయర్‌లు కోలగట్ల శ్రావణి, ముచ్చు లయయాదవ్, కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ శెట్టివీరవెంకటరాజేశ్వరరావు, అసిస్టెంట్ కమిషనర్ సిహెచ్ తిరుమలరావు, కార్పొరేషన అకౌంట్స్, ఇంజినీరింగ్, టౌన్‌ప్లానింగ్, తదితర విభాగాలకు చెందిన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

2025-26 ఆర్థిక సంవత్సర బడ్జెట్ ప్రతిపాదనలు

విజయనగరం మున్సిపాలిటీ నుంచి కార్పొరేషన్ హోదా దక్కించుకున్న తరువాత నాల్గవ సారి 2025-26 నూతన ఆర్థిక సంవత్సర బడ్జెట్‌ను రూ.156.93 కోట్లతో ప్రతిపాదించిగా అందులో రూ.72.45 కోట్లతో నగరంలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు కేటాయించారు. వాటిలో ప్రధానమైన పనులు వివరాలు ఇలా ఉన్నాయి.

- రూ.10 కోట్ల సాధారణ నిధులతో కొత్తగా రోడ్లు వేయటం.
- రూ. 2.50 కోట్ల బీపీఎస్ నిధులతో అభివృద్ధి పనులు చేపట్టడం.
- రూ. 12.00 కోట్ల 15వ ఆర్థిక సంఘం నిధులతో అభివృద్ధి పనులు చేపట్టడం.
- రూ.1 కోటితో సచివాలయాలకు పక్కా భవనాలు నిర్మించటం.
- రూ.1 కోటితో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నిర్మాణం.
- రూ.1.50 కోట్లతో హార్టీకల్చర్, పట్టణ సుందరీకరణ పనులు.
- రూ.5 కోట్ల సాధారణ నిధులతో మురుగు కాలువలు, కల్వర్టుల నిర్మాణం.
- రూ.1 కోటితో సెంట్రల్ లైటింగ్, పార్కుల లైటింగ్, జంక్షన్ లైటింగ్ ఏర్పాటు.
- రూ. 1.50 కోట్లతో పార్కులు, ప్లే గ్రౌండ్స్‌లో అభివృద్ధి పనులు.
- రూ. 1 కోటితో కమ్యూనిటీ టాయిలెట్స్ నిర్మాణం.
- రూ. 2.50 కోట్లతో నీటి సరఫరా కోసం పైప్‌లైన్ల విస్తరణ.
- రూ. 1 కోటితో కొత్త విద్యుత్ స్తంభాల ఏర్పాటు.
- రూ. 2 కోట్ల నెడ్‌క్యాప్ నిధులతో పట్టణంలో కాలుష్య నివారణ చర్యలు.
- రూ. 1 కోటితో కమ్యూనిటీ హాల్స్, కల్యాణ మండపాల నిర్మాణం.
- రూ. 50 లక్షల ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులతో అభివృద్ధి పనులు.
- రూ. 50 లక్షలతో కొత్త బోర్లు.
- రూ 1.25 కోట్లతో ట్రాఫిక్ ఐల్యాండ్స్ అభివృద్ధి పనులు.
- రూ. 1.25 కోట్లతో చెరువులు సుందరీకరణ, అభివృద్ధి పనులు.
- రూ.2 కోట్లతో కార్పొరేషన్ ఆస్తుల రక్షణ నిమిత్తం ప్రహరి గోడల నిర్మాణం.
- రూ. 1 కోటితో ఆధునిక జంతు వధశాల నిర్మాణం.

5న హైందవ శంఖారావం

భోగాపురం: విజయవాడలో జనవరి 5న జరిగే హైందవ శంఖారావ కార్యక్రమంలో పాల్గొనాలని వీహెచ్‌పీ ప్రతినిధులు ఎమ్మెల్యే లోకం నాగమాధవిని కోరారు. ఈ మేరకు మంగళవారం ముంజేరులోని తన నివాసంలో ఆమెను కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేవాలయాల నిర్వహణలో చేయాల్సిన సంస్కరణల నిమిత్తం ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. హిందు దేవాలయాలను ప్రభుత్వ నియంత్రణ నుంచి విముక్తిని చేసి, స్వయం ప్రతిపత్తి కలిగిన ఒక ఉత్తమధార్మిక వ్యవస్థకు అప్పగిస్తూ వెంటనే చట్ట సవరణ చేయాలని కోరుతూ విశ్వహిందూ పరిషత్ ఒక జాతీయోద్యమానికి శ్రీకారం చుట్టిందని అన్నారు. అనంతరం ఎమ్మెల్యే నాగమాధవి వీహెచ్‌పీ ప్రతినిధులతో కలిసి శంఖారావ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ ప్రతినిధులు శ్రీనివాస్, నాగరాజుశర్మ, బూర్ల శ్రీధర్, మురళీకృష్ణ, సీతారాములు, త్రినాథ్‌శ్రీకృష్ణ, బ్రహ్మాజీ, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

జ్యూట్ మిల్ చర్చలు వాయిదా దుర్మార్గం

నెల్లిమర్ల: జ్యూట్ మిల్ చర్చలు వాయిదా వేయడం దుర్మార్గమని జ్యూట్ మిల్ వర్కర్స్ యూనియన్ నాయకులు కిల్లంపల్లి రామారావు ధ్వజమెత్తారు. జ్యూట్ మిల్ చర్చలకు విశాఖపట్నం లేబర్ కమిషనర్ వద్ద మంగళవారం హాజరవ్వగా జ్యూట్ యాజమాన్యం గైర్హాజర్ కావడంతో చర్చలు ఈ నెల 27కి వాయిదా వేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా జ్యూట్ మిల్ వర్కర్స్ యూనియన్ నాయకులు రామారావు మాట్లాడుతూ జ్యూట్ చర్చలు వాయిదా వేయడం దుర్మార్గమన్నారు. ముఖ్యంగా లేబర్ అధికారులు జ్యూట్ యాజమాన్యానికి వత్తాసు పలకడం వల్ల చర్చలకు గైర్హాజరు అవుతుందన్నారు. గత 7నెలలుగా జ్యూట్ యాజమాన్యం అక్రమంగా లాకౌట్ చేసి కార్మికులను ఇబ్బంది పెడుతుంటే ప్రభుత్వానికి కనిపించలేదా? అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వంలో జ్యూట్ కార్మికులకు న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టర్ జోక్యం చేసుకొని ఈ నెల 25న క్రిస్మస్ కాబట్టి క్రిస్టియన్ సోదరులకు బోనస్ ఇవ్వాలని, మిల్లును తెరిపించి కార్మికులకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. లేకుంటే కార్మికులతో ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు



నెల్లిమర్ల రూరల్: సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ సుదర్శనరావు



భోగాపురం: రైతుల నుంచి వినతులను స్వీకరిస్తున్న తహసీల్దార్ సురేష్

నెల్లిమర్ల రూరల్: గ్రామాల్లో రెవెన్యూ సమస్యల పరిష్కారానికే సదస్సులు నిర్వహిస్తున్నామని తహసీల్దార్ సుదర్శనరావు అన్నారు. మండలంలోని బొప్పడాం సచివాలయంలో మంగళవారం రెవెన్యూ సదస్సును నిర్వహించి రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మ్యుటేషన్లకు సంబంధించి ఎక్కువగా రైతుల నుంచి వినతిపత్రాలు వస్తున్నాయని, నిబంధనలను అనుసరించి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ, ఇతర శాఖల సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

భోగాపురంలో..

భోగాపురం: రైతుల భూ సమస్యలను పరిష్కరించేందుకే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ ఎం.సురేష్ తెలిపారు. మండలంలోని ముంజేరు గ్రామ సచివాలయంలో రెవెన్యూ సదస్సు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రైతులు ఎదుర్కొంటున్న వివిధ రకాల భూ సమస్యలను తమ దృష్టికి తెస్తే వాటిని సర్వే చేసి 45 రోజుల్లో పరిష్కరిస్తామని తెలిపారు. సదస్సులో 45 వినతులు వచ్చాయని ఆయన వెల్లడించారు. మండల సర్వేయర్ ముదికేశ్వరరావు, సర్పంచ్ పూడిక నూకరాజు, పిడుగు వెంకటసత్యం, ఆదినారాయణ, జోగారావు, వీఆర్‌ఓ వి.శ్రీనివాసరావు, రైతులు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్రీస్తు మార్గం గొప్పది



దివ్యాంగులకు వస్త్రాలు, దుప్పట్లు అందజేస్తున్న యేసు ప్రేమాలయం చర్చి నిర్వాహకులు

విజయనగరం టౌన్: క్రీస్తు పుట్టుక చరిత్రకే ఒక దిక్సూచి అని యేసు ప్రేమాలయం చర్చి పాస్టర్ అలజంగి రవికుమార్ పేర్కొన్నారు. స్థానిక అంబటిసత్రం వద్దనున్న చర్చి ఆవరణలో మంగళవారం ఫ్రెండ్స్ క్రిస్‌మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీస్తు మార్గం చాలా గొప్పదని, అది అందరికీ మార్గదర్శమన్నారు. జీవితానికి మార్గాన్ని, శాంతిని క్రీస్తు మనకు అందిస్తారన్నారు. జీవితంలో ఎదురయ్యే సమస్యలను అధిగమించే మార్గాన్ని బైబిల్ మనకు చూపిస్తుందన్నారు. ఈ సందర్భంగా విజయనగరం, మన్యం జిల్లాల నుంచి వచ్చిన దివ్యాంగులకు, వృద్ధులకు దుప్పట్లు, పండ్లు, స్వీట్లు అందజేశారు. కేక్ కట్ చేశారు. యూత్‌ఫర్ జీసెస్ టీమ్ ఆలపించిన క్రీస్తు గీతాపాలన ఆద్యంతం ఆకట్టుకుంది. రెవరెండ్ నాగేశ్వరరావు దైవసందేశాన్ని అందజేశారు. ముఖ్య అతిథిగా డాక్టర్ భానుప్రకాష్ హాజరై క్రిస్‌మస్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కె.సూర్యనారాయణ, సిస్టర్ సువర్ణ, వెంకటలక్ష్మి, సువార్తమ్మ, విక్టర్‌బాబు, రెవరెండ్ నిర్మల సురగాల, దివ్యాంగుల నాయకులు శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనే ధ్యేయంగా పని చేయాలి



విజయనగరం రూరల్: శిక్షణను ఉద్దేశించి మాట్లాడుతున్న అధికారులు



డెంకాడ: కార్యక్రమంలో మాట్లాడుతున్న పరిశీలకులు సుబ్బారావు

విజయనగరం రూరల్: మండలంలోని ప్రతీ గ్రామంలోనూ పేదరికాన్ని పూర్తి స్థాయిలో నిర్మూలించే దిశగా ప్రతీ సచివాలయ కార్యదర్శి పని చేయాలని ఎంపీడీఓ తిరుపతినాయుడు అన్నారు. ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో రెండు రోజుల పాటు సుస్థిరాభివృద్ధి పలు లక్ష్యాలపై శిక్షణ కార్యక్రమంలో మంగళవారం ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లోని జవాబుదారీతనం, బాలల వికాసం, సామాజిక వికాసంతో పాటు తాగునీరు, పారిశుధ్యంపై స్థానికులకు ఎప్పటికప్పుడు అవగాహన కలిగించాల్సిన అవసరం అందరిపై ఉందన్నారు. ప్రతీ ఒక్కరికి ఉపాధి హామీ వంద రోజులు పని కల్పించే దిశగా సంబంధిత అధికారులు దృష్టి సారించాలని కోరారు. కార్యక్రమంలో శిక్షణ బృందం రాజారావు, విజయ్ పాల్గొన్నారు.

సమాజంలో మార్పుతో అభివృద్ధి

డెంకాడ: సమాజంలో మార్పుతో అన్ని విధాలుగా అభివృద్ధి జరుగుతుందని శిక్షణ కార్యక్రమం పరిశీలకులు సుబ్బారావు అన్నారు. లోకలైజేషన్ ఆఫ్ సస్టైనబుల్ డవలప్‌మెంట్ జోల్ పేరుతో రెండు రోజులుగా నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమం మంగళవారంతో ముగిసింది. కార్యక్రమంలో పరిశీలకులు సుబ్బారావు మాట్లాడుతూ స్వయం సమృద్ధి దిశగా స్థానిక సంస్థలు పని చేయాలన్నారు. సమాజంలో స్త్రీలకు సమాన గౌరవం ఉండేలా సమాజాన్ని చైతన్య పరచాలన్నారు. బాల్య వివాహాలను పూర్తి నియంత్రించేందుకు అందరూ కృషి చేయాలన్నారు. ఎంపీడీఓ భవాని, ఈఓపీఆర్డీ శ్రీనివాస్, ఏపీఎం శ్రీనివాస్, పలువురు సర్పంచ్‌లు, పలు విభాగాల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి చర్యలు

నెల్లిమర్ల: నియోజకవర్గ వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి చర్యలు ప్రారంభించినట్లు ఆ పార్టీ నెల్లిమర్ల నియోజకవర్గ ఇన్‌చార్జ్ గంటా సత్యనారాయణ(సతీష్)చెప్పారు. నియోజకవర్గ కేంద్రం నెల్లిమర్లలో ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల పుట్టినరోజు వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. పార్టీ కార్యాలయంలో కేకు కట్ చేశారు. పలువురు మహిళలకు చీరలు, పండ్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ త్వరలోనే నాలుగు మండలాల్లో పదిమంది చొప్పున కమిటీలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. పార్టీ ఓబీసీ నియోజకవర్గ అధ్యక్షుడు రాయల సురేశ్, యువజన విభాగం అధ్యక్షుడు కొమ్మూరు మధుసూదనరావు, సోషల్ మీడియా కన్వీనర్ పృథ్వీ తదితరులు పాల్గొన్నారు.

విజయనగరంలో..

విజయనగరం ఫోర్ట్: కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పీసీసీ అధ్యక్షురాలు షర్మిల జన్మదిన వేడుకలు మంగళవారం నిర్వహించారు. డీసీసీ అధ్యక్షుడు మరిపి విద్యాసాగర్ కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ షర్మిల నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలపడుతుందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గేదెల తిరుపతిరావు, రామచంద్రరాజు, సమీర్, షరీఫ్, రీప్, రహమాన్, శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

భారతీయ సంస్కృతిని పరిరక్షించుకోవాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధ్యాపకుడు రమణ

నెల్లిమర్ల రూరల్: భారతీయ సంస్కృతీ, సంప్రదాయాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని విజయనగరం మహారాజ సంస్కృత కళాశాల అధ్యాపకుడు టి.రమణ అన్నారు. మండలంలోని టెక్కలి సెంచూరియన్ విశ్వ విద్యాలయంలో విద్యార్థులకు మంగళవారం అవగాహన కల్పించారు. మెరుగైన జీవితాన్ని గడపడానికి రామాయణం, మహా భారతం, భగవద్గీత బోధనలు ఎంతో దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో ఇండియన్ నాలెడ్జ్ సిస్టమ్ కన్వీనర్ డాక్టర్ దేవికారిణి, ఐక్యూసీ హెడ్ ప్రొఫెసర్ ఎంఎల్ఎస్ ఆచార్యులు పాల్గొన్నారు.

సీతారాములకు పంచామృతాభిషేకాలు



మండలంలోని సారిక పంచాయతీ పరిధిలో ఉన్న శ్రీరామనారాయణంలో సీతారాములకు పంచామృతాభిషేకాలను ఆలయ ప్రధాన అర్చకులు చాణక్య, శ్రీహర్ష నిర్వహించారు. మంగళవారం పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకుని సీతారాములకు వేదమంత్రాల నడుమ అభిషేకాలను నిర్వహించారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు నారాయణం నీరజ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. – విజయనగరం రూరల్

ప్రజారోగ్య నియామవళిపై అవగాహన



ప్రజలకు ఆరోగ్య నియామవళిపై అవగాహన కల్పించాలని డాక్టర్ చిట్టి రమణ రావు అన్నారు. విజయనగరంలోని వీటీ అగ్రహారం సమీపంలోని మామిడి తోటలో ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల ఆత్మీయ సమ్మేళనం మంగళవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సీజన్‌లో సీఓపీడీ, న్యుమోనియా వంట వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉందన్నారు. వీటిపై అవగాహన కల్పించాలన్నారు. సంఘం గౌరవాధ్యక్షుడు జంగం జోషి, జిల్లా అధ్యక్షుడు గద్దె చిరంజీవి తదితరులు పాల్గొన్నారు. – విజయనగరం ఫోర్ట్

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత



విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని కమిషనర్ పి.నల్లనయ్య సూచించారు. నగరంలో వివిధ ప్రాంతాల్లో మంగళవారం పర్యటించిన ఆయన అభివృద్ధి పనులు, పైపులైను పనులను పరిశీలించారు. జిల్లా కేంద్రాస్పత్రిలో నూతనంగా నిర్మితమవుతున్న మరుగుదొడ్ల నిర్మాణ పనులను, నాణ్యతను పరిశీలించారు. రెవెన్యూ కాలనీలో రహదారి నిర్మాణ పనులు, వాటి నాణ్యతను చూశారు. స్టేడియంపేట కాలనీకి వెళ్లి అసంపూర్తి నిర్మాణంలో ఉన్న అర్బన్ హెల్త్ సెంటర్ పరిస్థితిని పర్యవేక్షించారు. – విజయనగరం

కాంట్రాక్ట్ హెల్త్ అసిస్టెంట్లను విధుల్లోకి తీసుకోవాలి



మాట్లాడుతున్న టీఎన్ మెడికల్ అండ్ హెల్త్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు వర్మ

పూసపాటిరేగ : తొలిగించిన కాంట్రాక్టు మేల్ హెల్త్ అసిస్టెంట్‌లను విధుల్లోకి తీసుకోవాలని టీఎన్ మెడికల్ అండ్ హెల్త్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు టిబిఎస్.వర్మ డిమాండు చేసారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సమీపంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. సుమారు 22 సంవత్సరాలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో వైద్య సేవలు అందించి న్యాయస్థానం తీర్పుతో కాంట్రాక్టు హెల్త్ అసిస్టెంట్లు రోడ్డున పడ్డారన్నారు. సమావేశంలో హెల్త్ యూనియన్ సంఘం నాయకులు బంగారుబాబు, ఆర్‌వీ రమణ తదితరులు పాల్గొన్నారు.

అభినందనలు



సాగునీటి సంఘం కమిటీ సభ్యులను అభినందిస్తున్న ఎమ్మెల్సీ పెనుమత్స

నెల్లిమర్ల రూరల్: మండలంలోని మొయిద విజయరామపురం గ్రామంలో ఇటీవల జరిగిన సాగునీటి సంఘం ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నికైన చైర్మన్, కమిటీ సభ్యులు ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబును మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సాగునీటి సంఘం చైర్మన్ జమ్ము సత్యం, కమిటీ సభ్యులు పతివాడ సత్యం, మండల అప్పలరాజు, అక్కునాయుడులను ఆయన అభినందించారు. ఆయకట్టు రైతుల సమస్యల పరిష్కారానికి కమిటీ సభ్యులు కృషి చేయాలని ఎమ్మెల్సీ సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ అట్టాడ కృష్ణ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.